

ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తోటవారిపాలెం పోలేరమ్మ తల్లి



నాయినిపల్లిలో శిడిమహోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వేడుకగా పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లు

చీరాల టౌన్: భక్తుల పాలిట కొంగు బంగారంగా ఉండే తోటవారిపాలెం పోలేరమ్మ తల్లి 55వ శిడి మహోత్సవం, తిరునాళ్లను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా శిడి పెళ్లి కొడుకుతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి గుడి వద్ద ఉండే శిడిమానుకు ఒక పెట్టిలో మేకపోతును ఉంచి గుడి చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయించారు. ఈ సమయంలో శిడిమాను పైభాగంలో చెక్కపెట్టెలో ఉంచిన మేకపోతును భక్తులు జీడికాయలతో కొట్టారు. శిడిమాను లాగితే కష్టాలు తొలిగిపోతాయని భావించే భక్తులు శిడిమాను బండిని లాగేందుకు పోటీ పడ్డారు. పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ప్రత్యేకంగా విద్యుత్ ప్రభలు ఆకర్షణగా నిలిచాయి. తిరునాళ్లలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఏఆర్, సివిల్ పోలీసులతో భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు.

వేటపాలెం: నాయినిపల్లిలో వేంచేసియున్న పోలేరమ్మ అమ్మవారి 48వ శిడి మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్సై

వైభవంగా శివాలయ వార్షిక మహోత్సవం

కారంచేడు: మండల కేంద్రమైన పెద్ద బజారులో గత వందేళ్లకు పైగా విశిష్టత కలిగిన పెద బజారు శివాలయం (గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం) పునః ప్రతిష్ట నవమ వార్షిక మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా నిర్విరామంగా పెద్ద ఎత్తున భజనలు, శివనామ స్మరణలు, సంకీర్తనలు నిర్వహించారు. చివరి రోజున మంగళవారం ఉదయం నుంచి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. గ్రామానికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్యాలు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పెద్ద ఎత్తున సుమారు 10 వేల మందికి పైగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బల్లికురవ: మండలంలోని గుంటుపల్లి గ్రామంలో వేంచేసిఉన్న హనుమత్ సమేత సీతారామస్వామి ఆలయ పదో వార్షికోత్సవం మంగళవారం కనుల పండువగా కమనీయంగా నిర్వహించారు. అర్చకుడు కొండ కావూరి అయ్యప్ప దీక్షితులచే స్వామి అమ్మవార్లకు తులసీ దళాలు, వివిధ రకాల పుష్పాలతో అష్టోత్తరాలు, అర్చనలు విశేషపూజలు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఆంజనేయుడికి సింధూరపూజ, తమలపాకులతో పూజ ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామనామ సంకీర్తన చేపట్టారు.



కూచిపూడి నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

సంక్షిప్తంగా

ఇల్లు నిర్మించి ఇచ్చిన దాతలు



పూర్తి చేసిన ఇంటిని అప్పగిస్తున్న దాతలు

చినగంజాం: అగ్ని ప్రమాదంలో పూరిగుడిసె కాలిబూడిదై రోడ్డున పడిన మహిళ కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇచ్చారు దాతలు. మండల కేంద్రంలోని ప్రభుదేవా కాలనీకి చెందిన కట్ట తిరుపతమ్మ తల వెంట్రుకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేది. అయితే గత ఆదివారం తన నివాసం ఉంటున్న పూరిపాక అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న సూర్యశ్రీ దివంగుల చారిటబుల్ ట్రస్ట్ చేయూత మిత్రమండలి బేస్తవారిపేట, నవ స్వప్న ఫౌండేషన్ సంయుక్తంగా ఇంటి నిర్మాణం పూర్తి చేసి మంగళవారం తిరుపతమ్మకు అందజేశారు. తిరుపతమ్మ భర్త మూడు నెలల క్రితమే గుండెపోటుతో మరణించాడు. ఆమెకు ముగ్గురు పిల్లలున్నారు. ఇల్లు నిర్మించి ఇచ్చిన దాతలను కాలనీ వాసులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఒత్తిడిలేని విద్య

బల్లికురవ: బట్టీ విధానం లేకుండా పాఠ్యపుస్తకాలతో ప్రభుత్వ కళాశాలలోనే ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి గ్రామాల్లో పదో తరగతి పరీక్షల్లో పాసైన విద్యార్థులు తల్లిదండ్రులను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇంటింటికి వెళ్లి కలిసి అప్లికేషన్లు అందజేశారు. అతి తక్కువ ఫీజుతో ఉచిత పాఠ్యపుస్తకాలు, డిజిటల్‌తరగతులు, ప్రయోగశాలలతో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, తెలుగు ఇంగ్లిషు మీడియంలో బోధన చేస్తున్నట్లు చెప్పారు. క్యాంపెయిన్‌లో అధ్యాపకులు పాల్గొన్నారు.



క్యాంపెయిన్‌లో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తూకాల్లో తేడాలొస్తే చర్యలు తీసుకుంటాం



కేసులు నమోదు చేస్తున్న తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్

చీరాల టౌన్: ప్రతి వ్యాపారస్తుడు విధిగా వారి తూకం (కాటాలను) ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకుని వ్యాపార కార్యకలాపాలు చేసుకోవాలని తూనికలు, కొలతలుశాఖ చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం పట్టణంలోని నెహ్రూ కూరగాయల మార్కెట్‌లోని కూరగాయల దుకాణాలు, మార్కెట్ సమీపంలోని పండ్ల దుకాణాల్లోని కాటాల రెన్యువల్స్‌ను పరిశీలించారు. ఏడుగురు వ్యాపారులు తమ కాటాలను రెన్యువల్ చేయించుకోకుండా వ్యాపారాలు చేస్తుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. ఈసందర్భంగా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరావు మాట్లాడుతూ పారస్తుడు విధిగా తమ తూకం కొలిచే కాటాలను, రాళ్లను విధిగా రెన్యువల్ చేయించుకుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

ముగిసిన సోపిరాల తిరునాళ్లు



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

చినగంజాం: మండలంలోని సోపిరాల, కడవకుదురు గ్రామాల్లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోలేరమ్మ తిరుణాల కార్యక్రమం మంగళవారం అత్యంత ఘనంగా నిర్వహించి ముగించారు. ఇందులో భాగంగా సోపిరాల శివారు పోలేరమ్మ ఆలయంలో గ్రామంలోని మహిళలు బిందెలతో నీటిని తీసుకొని వెళ్లి అమ్మవారికి జలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు అమ్మవారికి వడపప్పు పానకం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు గ్రామంలోని ప్రజలు విశేషంగా పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు.



వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి దేవిడ్ మంగళవారం తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు.

కారంచేడు సొసైటీ సభ్యుల రాజీనామా

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బోర్డు సభ్యులు మంగళవారం తమ పదవులకు రాజీనామాలు చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పరాజయం పాలవ్వడంతో మనస్తాపంతోను, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారి ఆదేశాల మేరకు నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న వారిని తొలగించాలని వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని సొసైటీ అధ్యక్షులు పులి గంగరాజు, సభ్యులు యార్లగడ్డ శ్రీకాంత్, బీ శ్రీనివాసరావులు పేర్కొన్నారు. తమ రాజీనామా పత్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారికి పంపుతున్నామని వారు పేర్కొన్నారు.

అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తే చర్యలు

వేటపాలెం: ప్రభుత్వం అనుమతి లేకుండా విత్తనాలు విక్రయిస్తున్న షాపులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ సహాయ సంచాలయకులు కే ధనరాజ్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని ఎరువుల డీలర్ షాపులను వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు పరిశీలించారు. రాఘవేంద్ర ట్రేడర్స్, గోవర్ధన ఫర్టిలైజర్, లక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్‌లను పరిశీలించారు. షాపుల్లో లైసెన్సు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాలిటీ ఉన్న విత్తనాలు ప్రభుత్వం అనుమతి ఉన్న కంపెనీ నుంచి తెచ్చి విక్రయించుకోవాలని తెలిపారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కి తరలించిన వారి షాపు లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్స్‌లు పొందిన షాపుల్లోనే ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఐ కాశీవిశ్వనాథ్, వీఏఏ జయప్రకాష్ పాల్గొన్నారు.